# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 సంచిక: 112 పేజీలు: 5 వెల: రూ.4/- శనివారం 20 డిసెంబర్ 2025 ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## ఫోన్ ట్యాపింగ్‌పై సజ్జన్నార్ నేతృత్వంలో సిట్

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే ఉదయం)

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో కీలక నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ గడువును మరోవారం రోజుల పాటు పొడిగించింది సుప్రీం కోర్టు. డిసెంబర్ 25 వరకు కస్టోడియల్ విచారణ చేసేందుకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. గురువారం ప్రభాకర్ రావు వారం రోజుల కస్టోడియల్ విచారణ పూర్తి అయిన విషయం తెలిసిందే. అయితే ట్యాపింగ్ కేసులో మరికొన్ని రోజులు విచారణ చేయాలని సుప్రీంకోర్టును సిట్ కోరింది. వారం రోజుల కస్టోడియల్ విచారణ రిపోర్ట్‌ను ఉన్నత న్యాయస్థానానికి సిట్ అందజేసింది. దీంతో ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణను వారం రోజుల పాటు పొడిగింపుకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చింది.

### వికసిత భారత్ లక్ష్య సాధనలో

## సర్వీస్ కమిషన్ల పాత్ర కీలకం

**ఉద్యోగ నియామకాల్లో పారదర్శకతకు పెద్దపీట**

**సమస్యలపై వేగంగా స్పందించి..చర్యలు తీసుకోవాలి**

**పబ్లిక్ సర్వీస్ కమిషన్ల జాతీయ సదస్సులో రాష్ట్రపతి ముర్ము**




హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే ఉదయం)

ఉద్యోగ నియామకాల విషయంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు వేగంగా స్పందిస్తున్నాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో నిర్వహించిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ల జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సదస్సులో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నా. 1950 తర్వాత యూపీఎస్సీ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఏర్పాటు మొదలైంది. ఈ విషయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కీలక పాత్ర పోషించారు. నియామకాల్లో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలి. ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కారం అవసరం అని రాష్ట్రపతి అన్నారు. నియామకాల్లో పారదర్శకత, ప్రజల్లో విశ్వసనీయత పెంచడంపై దృష్టి సారించాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. నియామకాల్లో ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 2047 వికసిత భారత్ లక్ష్య సాధనలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అలాగే నియామకాల్లో పారదర్శకత, నైతికత అవసరమని స్పష్టం చేశారు. నైపుణ్యాలు నేర్పవచ్చని కానీ సమగ్రత లోపాన్ని మాత్రం భర్తీ చేయలేమన్నారు. టెక్నాలజీ సవాళ్లను ఎదుర్కొనేలా పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కమిషన్ చైర్మన్లకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. రెండు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్లు.. ఈ సదస్సుకు హాజరయ్యారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరీక్షల నిర్వహణలో అనుసరించాల్సిన పద్ధతులు, పరస్పర సహకారంపై ఈ సదస్సులో చర్చించనున్నారు. సదస్సుకు హాజరైన రాష్ట్రపతి ముర్ముకు రామోజీ ఫిలిం సిటీలో ఘన స్వాగతం పలికారు. ఆమె వెంట తెలంగాణకు చెందిన పలువురు మంత్రులతోపాటు ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మయూపీఎస్సీ చైర్మన్ అజయ్‌కుమార్, యూపీఎస్సీ కార్యదర్శి శశి రంజన్ కుమార్

..మిగతా 2లో




## ప్రజావాణికి స్పందన లేదని విపక్షాలు దుష్ప్రచారం

**ప్రజావాణి సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్**

**బేగంపేట ప్రజాభవన్‌లో రాష్ట్రస్థాయి ప్రజావాణి రెండో వార్షికోత్సవం**

**ఇందిరమ్మ రాజ్యంలో గ్రామ సమస్యల పరిష్కారమే ధ్యేయమన్న మల్లు భట్టి విక్రమార్క**

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే ఉదయం)

రాష్ట్రంలోని వివిధ వర్గాల నుంచి వస్తున్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి, అన్ని శాఖలతో సమన్వయం చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బేగంపేటలోని ప్రజాభవన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ప్రజావాణి రెండో వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ప్రజావాణి ఇన్‌ఛార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని అన్నారు. ప్రజావాణి ప్రారంభించిన రెండేళ్లలో ఇప్పటి వరకు 74 శాతం ఫిర్యాదులు పరిష్కరించామని వెల్లడించారు. ప్రజావాణికి స్పందన లేదని విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆయన ఆక్షేపించారు. ఎన్ని దుష్ప్రచారాలు చేసినా ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని భరోసా

..మిగతా 2లో


## బెట్టింగ్ యాప్స్ కేసులో ఈడీ దూకుడు



**సోనూసూద్ సహా మాజీ క్రికెటర్లు యువరాజ్, ఊతప్పల ఆస్తుల అటాచ్**

2

## క్రిస్మస్ వేడుకలకు సిఎంకు ఆహ్వానం



హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే ఉదయం) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంత్రి అజారుద్దీన్, క్రిస్టియన్ మైనారిటీ నేతలు కలిసారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో నిర్వహించే క్రిస్మస్ వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి అజారుద్దీన్, క్రిస్టియన్ మైనారిటీ నేతలు ఆహ్వానం అందించారు. ఏటా ప్రభుత్వం క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తోంది. మైనార్టీ శాఖ దీనిని చేపట్టింది.

### పంచాయతీ ఎన్నికలు అయిపోయాయి..

## ఇక పంచాయితీలు పక్కనబెట్టండి: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే ఉదయం)

పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడం సులభం కానీ.. పంచాయతీ ఎన్నికల్లో గెలవడం కష్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ 10 సీట్లు గెలవలేదని.. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ 80 గ్రామాల్లో గెలిచిందని తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో సమావేశమైన కేటీఆర్.. వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికలు అయిపోయాయి కాబట్టి.. పగలు, పంచాయితీలో పక్కనబెట్టి కలిసికట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు.

సిరిసిల్ల ప్రజలు గులాబీ జెండాను గుండెలను హత్తుకున్నారని కేటీఆర్ అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కొన్ని చోట్ల రెండు వైపులా బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులే నిలబడ్డారని తెలిపారు. త్వరలోనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగబోతున్నాయని పేర్కొన్నారు. సిరిసిల్లలో ఉన్న 57 ఎంపీటీసీ స్థానాలు గెలిచేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అందరూ కలిసి కాంగ్రెస్‌పై కొట్లాడాలన్నారు. గులాబీ గెలుపును చూసి కాంగ్రెస్ పరేషన్

..మిగతా 2లో



## ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ఏ పార్టీలో ఉన్నాడో నియోజకవర్గ ప్రజలకు చెప్పాలి

**ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కాంగ్రెస్..**

**స్పీకర్ నిర్ణయం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు..**

**మైలార్ దేవులపల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్**

రాజేంద్రనగర్,డిసెంబర్19(నమస్తే ఉదయం)

రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ఏ పార్టీలో ఉన్నాడో తేల్చి చెప్పాలని నియోజకవర్గ ప్రజలతో పాటు బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపించారు. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదుపై ఎలాంటి రుజువులు లేదంటూ స్పీకర్ తేల్చడంతో నియోజకవర్గ ప్రజల్లో మరింత అనుమానం మొదలయింది.శుక్రవారం మాజీ కౌన్సిలర్,మైలార్ దేవులపల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేను నిలదీశారు.ఈ సందర్భంగా ఎస్. వెంకటేష్ మాట్లాడుతూ...స్పీకర్ నిర్ణయంతో నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీకి చెందినవారు కాదని బహిర్గతమయిందన్నారు.మరి ఎమ్మెల్యే ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారనే విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.దేశంలోనే అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చెప్పిన తీర్పుల స్ఫూర్తిని పట్టించుకోకుండా..కేవలం ఇక్కడి కాంగ్రెస్ పార్టీ ఒత్తిడికి తలొగ్గి స్పీకర్ నిర్ణయం తీసుకోవడం ఆశ్చర్యకరం.స్పీకర్ తీర్పును భారాస పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది"అని ఎస్.వెంకటేష్ పేర్కొన్నారు.

స్పీకర్ నిర్ణయం ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలి పెట్టులాంటిదని,స్వయంగా ఎమ్మెల్యే తాను నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారామని మీడియాకు తెలిపారని,అయినా స్పీకర్ మాత్రం పార్టీ మారలేదని చెప్పడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు.దమ్ముంటే కారు గుర్తు మీద గెలిచిన మీరు వెంటనే రాజీనామా చేసి,ఎన్నికల్లో పోటీచేసి గెలవాలని డిమాండ్ చేశారు.తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నాను అనుకుంటే ఈనెల 21వ తేదీన కేసీఆర్ అధ్యక్షతన జరిగే సీఎల్పీ ప్లీనరీ సమావేశానికి గులాబీ కండువా కప్పుకొని హాజరుకావాలన్నారు.ఒకవేళ హాజరు కాకపోతే,ప్రజలు ఆయనను పార్టీలో ఉన్నారని ఎలా నమ్ముతారని వారు ప్రశ్నించారు.ఒకవేళ ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లో లేనట్లయితే,వెంటనే తన పదవికి రాజీనామా చేసి మళ్ళీ ప్రజల తీర్పుకోరాలని డిమాండ్ చేశారు.ప్రజలు తమ ఓటు ద్వారా ఇచ్చిన అధికారాన్ని గౌరవించాలని,లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో రాజేంద్రనగర్ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని నీరుగార్చిందని..పార్టీ ఫిరాయింపుల చట్టం పనికిమాలిన చట్టం కాంగ్రెస్ పార్టీ చెప్పిందన్నారు. కాంగ్రెస్ పార్టీ తెచ్చిన చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ చంపేసిందని విమర్శించారు.



# ఐడిపియల్ భూములను పరిరక్షించాలి

## వామపక్ష పార్టీ లు సిపిఐ, సీపీఎం



కూకట్ పల్లి, డిసెంబర్ 19 (నమస్తే ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం లోని ఐడిపియల్ భూములను కాపాడాలని సిపిఐ, సీపీఎం పార్టీ ల ఆధ్వర్యంలో ఐడిపియల్ దగ్గర శుక్రవారం నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్ లు పాల్గొని వారు మాట్లాడుతూ ప్రభుత్వం వేసిన విచారణ కమిటీ నీ స్వాగతిస్తున్నామని, విచారణ కమిటీ నిష్పక్షపాతంగా విచారణ జరపాలని, ఐడిపిఎల్ ప్రభుత్వ భూమిని ప్రజల అవసరాలరీత్యా ఉపయోగించేలా చేయాలనీ అన్నారు. ఐడిపిఎల్ కంపెనీలో పనిచేసిన కార్మికులు కంపెనీ లాకౌట్ సందర్భంగా తీవ్రంగా నష్టపోయిన కార్మికులకు సహాయం చేయాలని, ఐడిపిఎల్ భూమిని కబ్జా చేసిన వారిని కఠినంగా శిక్షించాలని 900.20 ఎకరాల భూమి కాపాడాలని అన్నారు. గత ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు బహిరంగంగా నువ్వంటే నువ్వు కబ్జాలు చేసామని చెబుతున్న విచారణ కమిటీ వేసిన అక్కడ కానీ కబ్జాలలో నిర్మాణ పనులు జరగడం వెనకాల ఏ ప్రమేయం ఉందో ప్రజలకు అర్థం కాకుండా ఉందని అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వవాలు వెంటనే ఐడిపీల్ భూమిని కాపాడాలని అన్నారు. ఇంద్రనగర్ బస్తీలో గత 30-40 సంవత్సరాల నుండి నివాసముంటున్న నిరుపేదలకు పట్టాలిచ్చి కబ్జాదారుల నుండి భూమిని స్వాధీనం చేసుకోవాలని వామపక్ష పార్టీలు సిపిఐ, సిపిఎం పార్టీలు డిమాండ్ చేశాయి. లేని పక్షంలో మిగిలిన నిరుపేద ప్రజలందరినీ ఐక్యం చేసి భూ గుడిసెలను వేస్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం నాయకులు, సిపిఐ కూకట్ పల్లి మండల కార్యదర్శి జి.కృష్ణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, హరినాథ్, మాజీ కౌన్సిలర్ నర్సయ్య, కె. మనోజ్ చారి తదితరులు పాల్గొన్నారు.

# బెట్టింగ్ యాప్స్ కేసులో ఈడీ దూకుడు

## సోనూసూద్ సహా మాజీ క్రికెటర్లు యువరాజ్, ఊతప్పల ఆస్తుల అటాచ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 19 (నమస్తే ఉదయం)

బెట్టింగ్ యాప్స్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో విచారణ ముమ్మరంగా సాగుతోంది. ఈ కేసులో తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఉతప్ప, బాలీవుడ్ నటులు సోనూసూద్, నేహాశర్మ ఆస్తుల్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేసింది. ఆ జాబితాలో నటి ఊర్వశీ రౌతేలా తల్లితో పాటు టీఎంసీ మాజీ ఎంపీ మిమి చక్రవర్తి, బెంగాలీ నటుడు అంకుశ్ హజ్రా కూడా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు సంస్థ వీరిని ఇప్పటికే విచారించగా.. తాజాగా అటాచ్ చేసిన ఆస్తుల విలువ రూ.7.93 కోట్లని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. గతంలో మాజీ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌కు చెందిన రూ.11.14 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఇద్దరు మాజీ క్రికెటర్లు అన్ని విషయాలు తెలిసే వివిధ సంస్థల ప్రమోషన్ కోసం విదేశీ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారని గుర్తించింది. ఈ నేపథ్యంలోనే శిఖర్ ధావన్‌కు చెందిన రూ.4.5 కోట్ల స్థిరాస్తిని, సురేశ్‌కు చెందిన రూ.6.64 కోట్ల విలువైన మ్యూచువల్ ఫండ్‌లను సీజ్ చేసేందుకు మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల పార్లమెంట్ వేదికగా రియల్ మనీ ఆన్‌లైన్ గేమింగ్‌ను బ్యాన్ చేసిన సంగతి తెలిసిందే. బెట్టింగ్ యాప్స్ కోసం సెలబ్రెటీలు కోట్ల రెమ్యూనరేషన్ తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఇటీవల బెట్టింగ్ యాప్స్ కోసం ప్రమోషన్ చేసిన వారిపై ఈడీ కొరడాఝులిపిస్తుంది. ఆన్‌లైన్ బెట్టింగ్, మనీ లాండరింగ్ నిరోధక చట్టం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అధికారులు దూకుడు పెంచారు. పీఎంఎల్ ఏ కేసులో ప్రముఖల ఆస్తులను అటాచ్ చేశారు. ఇప్పటికే నటులు సోనూసూద్, నేహాశర్మ ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ, తాజాగా మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఊతప్ప, టీఎంసీ మాజీ ఎంపీ మిమి చక్రవర్తి, నటి ఊర్వశి రౌతేలా తల్లి ఆస్తులు సైతం అటాచ్ చేశారు.




# ప్రజావాణికి స్పందన లేదని విపక్షాలు దుష్ప్రచారం

మొదటి పేజీ తరువాయి...

ఇచ్చారు. అధికారానికి దూరమైన బీఆర్ఎస్ ఎన్ని విమర్శలు చేసినా తాము మరింత ముందుకు వెళతామని ఆయన అన్నారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో వనరులు ప్రజలకు ఉపయోగపడేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజావాణిని విజయవంతం చేసిన వారికి ఆయన అభినందనలు తెలియజేశారు.

# పంచాయతీ ఎన్నికలు అయిపోయాయి.. ఇక పంచాయితీలు పక్కనబెట్టండి: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి...

అయితోందని తెలిపారు. ఓడిపోయిన అభ్యర్థులు కూడా ధైర్యంగా ఉండాలని ధైర్యం చెప్పారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీచేయాలన్నారు. పాత తరం నాయకులు, కొత్త తరాన్ని కలుపుకుంటూ ముందుకుపోవాలన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి అప్పటికప్పుడు మాటలు మారుస్తున్నారని కేటీఆర్ అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రేవంత్ రెడ్డి మొదట 66 శాతం సర్పంచ్ స్థానాలు గెలిచామని చెప్పారని తెలిపారు. వెంటనే మాటమార్చి స్థానిక ఎన్నికలతో పార్టీకి సంబంధం లేదంటున్నాడని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి లాగే ఫిరాయింపు ఎమ్మెల్యేలు కూడా మాటలు మారుస్తున్నారని అన్నారు. అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరానని కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు మాటమార్చి బీఆర్ఎస్‌లోనే ఉన్నామని చెబుతున్నారని తెలిపారు. ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని పరిస్థితిలో కడియం, పోచారం ఉన్నారని విమర్శించారు. గడ్డిపోచలాంటి పదవి కోసం చూరుకు గబ్బిలాల్లా వేలాడుతున్నారని ఎద్దేవా చేశారు.

గెలుపు కోసం కాంగ్రెస్ ఎన్ని అరాచకాలు చేసినా ప్రజలు మాత్రం బీఆర్ఎస్‌తోనే ఉన్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో గులాబీ ప్రభంజనమే అందుకు నిదర్శనమని చెప్పారు. సర్పంచ్ అయినా ఎమ్మెల్యే, ఎంపీలు అయినా ప్రజల కోసమే పనిచేయాలని అన్నారు. ప్రతిపైసా ప్రజల కోసమే ఖర్చు పెట్టాలని సూచించారు. ఐదు అంచెల్లో ప్రభుత్వాన్ని ఎలా నడపాలో అంబేద్కర్ రాజ్యాంగంలో చెప్పారని గుర్తుచేశారు. కేంద్రం పైసలు ఇయ్యకున్నా.. రాష్ట్ర నిధులు ఉంటాయని తెలిపారు. గ్రామ పంచాయతీ నిధులు ఫైనాన్స్ కమిషన్ నుంచి వస్తాయని పేర్కొన్నారు. దాన్ని ఆపే హక్కు ఎమ్మెల్యేలకు లేదు.. సీఎం రేవంత్ రెడ్డికి కూడా ఉండదని స్పష్టం చేశారు.

గ్రామ పంచాయతీకి, మండల పరిషత్‌కు అనుసంధానకర్త ఎంపీటీసీ అని కేటీఆర్ తెలిపారు. అలాగే జిల్లా పరిషత్‌కు, మండల పరిషత్‌కు సమన్వయకర్త జడ్పీటీసీ అని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికలతో పంచాయితీలు పక్కనపెట్టాలని సూచించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పల్లెపల్లెనా డంపింగ్ యార్డులు, ప్రగతి వనాలు ఏర్పాటు చేశామని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పల్లెలు నిర్వీర్యం అయ్యాయని విమర్శించారు.

# వికసిత భారత్ లక్ష్య సాధనలో సర్వీస్ కమిషన్ల పాత్ర కీలకం

మొదటి పేజీ తరువాయి...

తదితరులు హాజరయ్యారు. ఈ సదస్సు శనివారంతో ముగియనుంది. ఈ సదస్సుకు భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హాజరుకానున్నారు. అంతకుముందు బొల్లారం రాష్ట్రపతి భవన్ నుంచి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రామోజీ ఫిల్మ్‌సిటీకి చేరుకున్నారు. దేశంలోని పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శీతాకాల విడిది కోసం హైదరాబాద్ వచ్చిన ద్రౌపదీ ముర్ము.. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో రామోజీ ఫిల్మ్‌సిటీకి చేరుకున్నారు. రాష్ట్రపతి వెంట గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి సీతక్క ఉన్నారు. దేశంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించారు. సదస్సు అనంతరం సాయంత్రం రామోజీ ఫిల్మ్‌సిటీలో వివిధ ప్రదేశాలను ద్రౌపదీ ముర్ము సందర్శించారు.

# మానవ రహిత వ్యవసాయ సాధనలో జయశంకర్ వర్శిటీ తొలి అడుగు

## అగ్రి రోబోటిక్స్ ల్యాబ్ ను ప్రారంభించిన ఎస్బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి

## 2030 నాటికి రైతు పొలాలలోకి రానున్న రోబోలు: ఉప కులపతి ప్రొఫెసర్ ఆల్టాస్ జానయ్య




అగ్రి రోబోటిక్స్ ల్యాబ్ ను ప్రారంభిస్తున్న ఎస్ బీ ఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి, వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య లు

బుద్వేల్, డిసెంబరు 19 (నమస్తే ఉదయం) : ఎస్ బీ ఐ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన తొలి దశ అగ్రి రోబోటిక్స్ ప్రయోగశాలను ఎస్బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి, వర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. భారతదేశంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో మొట్టమొదటి సారిగా ఇటువంటి అధునాతన అగ్రి రోబోటిక్స్ ప్రయోగశాలని ప్రొఫెసర్ జయశంకర్ వర్శిటీ లోనే స్థాపించారని వర్శిటీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా చల్లా శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ, వ్యవసాయ వర్శిటీ పూర్వ విద్యార్థిగా, తన వంతు తోడ్పాటుగా ఇటువంటి అదునాతన ప్రయోగశాలను ప్రారంభించడం సంతోషంగా ఉం దన్నారు. సంవత్సరం క్రితం వర్శిటీ వీసీ ప్రొఫెసర్ అల్టాస్ జానయ్య. అనాటి డీన్ డాక్టర్ జెల్లా సత్యనారాయణలు రోబోటిక్స్ ప్రయోగశాల ప్రతిపాధన ను తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. భవిష్యత్తులో వ్యవసాయ రంగానికి అవసరమైన అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందిం చడానికి ఈ ప్రయోగశాల చాలా తోడ్పాటు నందిస్తుందుని బావించి ఎస్బీఐ ఫౌండేషన్ ద్వారా వర్శిటీకి అనుబందంగా ఉన్న అగ్రి హబ్ కు ఆర్థిక సహాయం అందించడాలని నిర్ణయించినట్లు శ్రీనివాసులు శెట్టి తెలిపారు. భవిష్యత్తులో వ్యవసాయ రంగం వైపు యువతను ఆకర్షించడానికి కృతిమ మేధస్సుతో కూడిన డ్రోన్లు, రోబోటిక్స్ వంటి ఇతర అదునాతన సాంకేతిక పరిజ్ఞానం చాలా తోడ్పాటు అవుతుందని అన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ, 2047 నాటికీ వికసిత్ భారత్, తెలంగాణ రైజింగ్ లక్ష్యసాధనలో వ్యవసాయ, గ్రామీణ రంగాలు కీలకపాత్ర పోషించనున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కృతిమ మేధ అధారిత సాంకేతిక పరిజ్ఞానం పైననే భవిష్యత్తు వ్యవసాయ రంగం ఆధారపడి ఉందని ప్రొఫెసర్ జానయ్య వివరించారు. ఆ దిశగా మానవ రహిత వ్యవసాయ సాధనలో నేడు ఎస్ బీ ఐ ఫౌం డేషన్ ఆర్థిక సహకారంతో అగ్రి రోబోటిక్స్ ల్యాబ్ ని ప్రారంభించడం జరిగిందన్నారు. 2030-35 నాటికి తెలంగాణ రాష్ట్రంలోని రైతుల పొలాల్లో రోబోలు, డ్రోన్లు, మానవ రహిత ట్రాక్టర్లు, సెన్సార్ల వినియోగం విస్తృతం కానున్నాయన్నారు. ఈ లక్ష్య సాధనకు విశ్వవిద్యాలయంలో పరిశోధనలు చురుకుగా సాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రి హబ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి వెంకటేశ్వర్లు, అగ్రి రోబోటిక్స్ ల్యాబ్ ప్రాజెక్టు హెడ్ డాక్టర్ జెల్లా సత్యనారాయణ, ఎస్ బీ ఐ సీనియర్ అధికారులు ఎస్ రాధాక్రిష్ణన్, సంజయ్ ప్రకాశ్, జగన్నాథ్ సాహు లు పాల్గొన్నారు.



# అవంతి నగర్ తోటలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్ పల్లి, డిసెంబర్ 19 (నమస్తే ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం, మూసాపేట్ డివిజన్ మోతీ నగర్ లోని అవంతి నగర్ తోట లో కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను శుక్రవారం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పనులు ఆలస్యమైన విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఏమైనా ఇబ్బంది ఉంటే తనను సంప్రదించాలని ప్రజలకు అందుబాటులోకి పూర్తి చేసి త్వరలోనే అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేందర్, డివిజన్ ప్రెసిడెంట్ అంబటి శ్రీనివాస్, సిహెచ్ సత్యనారాయణ, తన్నీరు తిరుపతి, సత్యం, ప్రెసిడెంట్లు, వెంకటేశ్వర్లు, జోసఫ్, కందోజర్, మాజిద్ ఖాన్, ఉదయ్ కుమార్, సత్యనారాయణ, శ్రీనివాస్, దినేష్, అశ్విన్, శేఖర్, అశోక్ కుమార్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇంట్లో చొరబడి రెండు తులాల బంగారం చోరీ



బుద్వేల్, డిసెంబరు 19 (నమస్తే ఉదయం) : తాళం వేసిన ఇంట్లో కి చొరబడి రెండు తులాల బంగారం చోరీ చేసిన సంఘటన ఇది. ఈ సం ఘటన గురువారం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కిస్మత్ పూర్ లో జరిగింది. డిటెక్టివ్ ఇన్స పెక్టర్ నవీన్ కుమార్ కథనం ప్రకారం వివరాలు ఈ విదంగా ఉన్నాయి...... సెంట్రింగ్ మేస్త్రీ గా పనిచేసే బాలస్వామి గ్రామ పంచాయతీ ఎన్నికలలో ఓటు వేయడానికి స్వగ్రామానికి వెళ్లాడు. కొడుకు ఇంట్లో ఉన్నాడు. గురువారం ఉదయం బాలస్వామి కుమారుడు పని మీద బయటకు వెళ్లాడు. ఆ సమయంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి తాళం విరగ్గొట్టి బీరువా లో దాచిన రెండు తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లాడు. బాలస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా బాలస్వామి ఇంట్లోకి వెళ్లిన వ్యక్తి అచూకీ కోసం గాలిస్తున్నారు. డీఐ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# బంగారం కొంటున్నట్టు నటించి... గొలుసుతో ఉడాయించి..



పటాన్ చెరు, డిసెంబర్ 19 (నమస్తే ఉదయం): బంగారం కొంటున్నట్టు నటించి ఆరు గ్రాముల బంగారం గొలుసు తో ఉడాయించి షాపు యజమానిని బురిడీ కొట్టించిన ఘటన సంగారెడ్డి బొల్లారం డివిజన్ పరిధిలో చోటు చేసుకుంది. బంగారం గొలుసు కొంటానంటూ ఓ వ్యక్తి శివం జ్యూవెలరీ షాపు కు వచ్చాడు. ఆరు గ్రాముల గొలుసు కొంటున్నట్లు నటించి, డబ్బులు యూపిఏ ద్వారా చెల్లిస్తానని నమ్మబలికాడు. నిజమని నమ్మిన షాపు యజమాని గొలుసు ఇవ్వడంతో మెడలో వేసుకుని అదును చూసి షాపు నుండి గొలుసుతో బైక్ పై ఉడాయించాడు. షాపు యజమాని గ్రహించి అతడిని పెట్టుకొనేందుకు పరిగెత్తుకుంటూ వెళ్ళే లోగా బైక్ పై ఉడాయించాడు. దీంతో బంగారం షాపు యజమాని ఐడిఎ బొల్లారం పోలీసులను ఆశ్రయించాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ రవీందర్ రెడ్డి చెప్పారు.

# జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి

## రాజీయే రాజమార్గం

## బాలానగర్ ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి



బాలానగర్, డిసెంబర్ 19 (నమస్తే ఉదయం) ఈ నెల 21 వ తేదీన జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని బాలానగర్ ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా త్వరితగతిన, ఇరువైపుల సమ్మతితో సమస్యలను పరిష్కరించుకునే అవకాశం అందుబాటులో ఉందని తెలిపారు. రాజీ చేసుకునే అవకాశమున్న వివిధ రకాల కేసులు క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితం %ఉ% కుటుంబ సమస్యలకు సంబంధించిన కేసులు, డ్రంకన్ డ్రైవ్, మోటారు వాహన చట్ట ఉల్లంఘనలు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం తదితర కేసులు పరిష్కరించుకోవచ్చు అని వివరించారు. కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దని అన్నారు. న్యాయశాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని సూచించారు.

# వేసవి కార్యాచరణ-2026పై ఎండీ సమీక్ష

**డిమాండ్ ను బట్టి అదనపు ఫిల్లింగ్ స్టేషన్లు**
**బకాయిలు వసూలు చేయాలి, రెవెన్యూ పెంచాలి**
**15 వేల ఇంకుడు గుంతలు నిర్మాణానికి ప్రణాళిక**
**సమీక్ష సమావేశంలో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి**



హైదరాబాద్, డిసెంబర్ 19(నమస్తే ఉదయం) జీహెచ్ఎంసీతో పాటు ఓఆర్ఆర్ పరిధిలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సూక్ష్మ స్థాయి ప్రణాళికలు రచించుకోవాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఈడీ మయాంక్ మిట్టల్ లతో కలిసి వేసవి కార్యాచరణ ప్రణాళిక, తాగునీటి సరఫరా, రెవెన్యూ, ఇంకుడు గుంతలు ఎంసీసీ, సింగిల్ విండో, ఏఎంఎస్, స్టోర్స్ మాడ్యూల్ తదితర అంశాలపైన సీజీఎంలు, జీఎం, డీజీఎం, మేనేజర్లలతో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే వేసవికి తాగునీరు సరఫరా చేసేందుకు క్షేత్ర స్థాయిలో మైక్రో లెవల్ ప్లాన్స్ రూపొందించుకోవాలన్నారు. ఆయా ప్రాంతాలకు కేటాయించే నీటి సరఫరాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఏ ప్రాంతంలోనైనా సప్లైలో తక్కువ నీరుంటే.. సర్దుబాటు చేసే లాగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నీటి సరఫరా చేసేటప్పుడు సమయ పాలన పాటించాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని డిమాండును అంచనా వేసి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ప్రణాళికలు వేసుకోవాలన్నారు. నగరంలో ఇప్పటికే 1150 ట్యాంకర్లు, 90 ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లు, 150 ఫిల్లింగ్ పాయింట్స్ ఉండగా.. డిమాండ్ ని బట్టి అదనపు ఫిల్లింగ్ స్టేషన్ కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ప్రతి జీఎం.. సక్రమ నీటి సరఫరాకు ట్రాన్స్ మిషన్ అధికారుల సమన్వయంతో ఇన్ ఫ్లో ను పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజలు జలమండలి సరఫరా చేసే నీటిని త్రాగటానికి కాకుండా ప్రాంగణాలు, వాహనాలు కడగడానికి.. ఇతర అవసరాలకు నీటిని వృధా చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని.. అలాగే తాగునీటి సరఫరా సమయాల్లో కొంత మంది మోటార్లతో నీటిని తోడుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కు ఆదేశించారు. అలాగే రెవెన్యూ పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందులో భాగంగా ఇప్పటీవరకు బకాయిఉన్న వాణిజ్య కనెక్షన్లను గుర్తించి ప్రత్యేక దృష్టి సారిస్తే ప్రతినెల బోర్డుకు మరింత ఆదాయం సమకూరనుందని ఎండీ తెలిపారు. ప్రతి వెయ్యి రూపాయిలు ఆపైన నీటిని వినియోగించే వినియోగదారులను గుర్తించి వంద శాతం బిల్లును అందించి, వంద శాతం బిల్లు వసూలు చేయాలనీ అన్నారు. ప్రతినెల సరాసరి రెవెన్యూతో పాటు అదనంగా ప్రతి మేనేజర్ వారి సెక్షన్ పరిధిలో టాప్ 50 వినియోగదారుల బకాయిల బిల్లుల వసూలును లక్ష్యంగా నిర్దేశించారు. రెవెన్యూ వసూలులో ఉదాసీనంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఎండీ అధికారులను హెచ్చరించారు. మంచినీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారుల దృష్టి సారించాలని సూచించారు. జలమండలి పరిధిలో త్వరలో ప్రతీ డాకేట్ కు ప్రతి ఫ్లో మీటర్ ను పెట్టి, చివరి వినియోగదారుని వద్ద కూడా మీటర్ రీడింగ్ సరిపోయేలా లెక్క కడితే ట్రాన్స్ మిషన్ లాస్ తేలుస్తామని అన్నారు. దాని ద్వారా వృథాగా పోతున్న నీటిని గుర్తించి దాన్ని అరికట్టడానికి చర్యలు తీసుకునే వెసులుబాటు ఉంటుందని ఎండీ వివరించారు. రానున్న 100 రోజుల్లో జలమండలి పరిధిలో 200 గజాల ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు అవసరం.. 300 గజాల పైన ఉన్న ప్రతి ప్రాంగణంలో ఇంకుడు గుంత తప్పనిసరి నిర్మాణం చేసుకోవాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. జిహెచ్ఎంసీ నుండి ఓఆర్ ఆర్ వరకు భూగర్భ జలాలను పెంచే లక్ష్యంగా.. ఇంటికో ఇంకుడు గుంత కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా పని చేయాలని కోరారు. ప్రజా స్థలాలు,కాలనీలు,ప్రభుత్వ సముదాయాలు, విద్యా సంస్థలు,రోడ్డు పక్కన గల నివాస, వాణిజ్యసముదాయల రూఫ్ టాప్ నుండి కిందికి పడే వర్షపు నీటిని పైపుల ద్వారా సంరక్షణ కోసం ప్రజా ఇంకుడు గుంతల నిర్మాణానికి ఏర్పాటుకు చేసుకోవాలని అన్నారు. ఇప్పటికే జిహెచ్ఎంసీ పరిధిలో 8285 బోర్ వెల్ లు ఉండగా వాటిలో 4569 నిరుపయోగంలో ఉన్నట్లు.. ఈ బోరు బావులను హార్వెస్టింగ్ పిట్‌లతో ఇంజక్షన్ బోర్‌వెల్‌గా మార్చాలని ఆదేశించారు. వీటితో పాటు చుట్టూ నాలుగు జిల్లాలోని దాదాపు 1200 ప్రభుత్వ పాఠశాల ప్రాంగణాలలో ఇంకుడు గుంతలు నిర్మాణం చేసుకునేలాగా.. ఆయా జిల్లా డీఈవోలకు లేఖ రాయనున్నట్లు తెలిపారు. ఈ 100 రోజుల్లో 15 వేల ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టే విధంగా.. ఆ లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు. ఓ ఆర్ ఆర్ పరిధిలో వచ్చే 5 సంవత్సరాల్లో 50 వేల ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకుని 5 నుంచి 10 టీఎంసీల నీటిని భూగర్భంలోకి చేరేలా చేస్తే భవిష్యత్తులో కృష్ణ తాగునీటి సరఫరా పథకం%-%4, కొత్తగా ఇతర నీటి సరఫరా పథకాల నిర్మాణాలు అవసరం ఉండదు అని అన్నారు. కొత్త కనెక్షన్‌ల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే మంజూరు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త కనెక్షన్ మంజూరులో అలసత్వం ప్రదర్శిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఎండీ హెచ్చరించారు. ఎంసీసీకి వచ్చే ఫిర్యాదులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా కలుషిత నీరు, సీవరేజి ఓవర్ ఫ్లో, మిస్సింగ్ మ్యాన్ హోళ్లపై వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలన్నారు. ఆఫ్ లైన్ ఫిర్యాదులను సైతం ఎంసీసీ పరిధిలో నమోదు చేసి పరిష్కరించాలని అన్నారు. ఈ సమావేశంలో జలమండలి ఆపరేషన్ డైరెక్టర్లు టీవీ శ్రీధర్, వినోద్ భార్గవ సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుంది

**మందమూల పరమేశ్వర్ రెడ్డి**

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( నాచారం డివిజన్ ) డిసెంబర్ 19 ( నమస్తే ఉదయం) రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఇండియన్ నీ వీడియో సెలబ్రేషన్స్ లో భాగంగా ఎస్ ఎస్ ఎస్ యువసేన ఆధ్వర్యంలో నాచారంలోని సి డి ఎస్ బిల్డింగ్ లో ఐదవ కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ మందమూల పరమేశ్వర్ రెడ్డి పాల్గొని రిబ్బన్ కట్ చేసి కబడ్డీ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీఠ వేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో నడుస్తున్న ప్రజా పాలనలో క్రీడల అభివృద్ధితో పాటు క్రీడాకారులకు కావాల్సిన ప్రోత్సాహాన్ని అందిస్తుందని అన్నారు. రాష్ట్రంలోని యువ క్రీడాకారులకు సీఎం రేవంత్ రెడ్డి కావాల్సిన ప్రోత్సాహం అందిస్తూ కావాల్సిన సదుపాయాలను కల్పిస్తూ అన్ని విధాలుగా తీర్చి దిద్దుతున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాచారం డివిజన్ అధ్యక్షుడు బండారి శ్రీకాంత్ గౌడ్, కృష్ణారెడ్డి, ప్రకాష్ రెడ్డి, హెచ్ఆర్ మోహన్, రామ్ రెడ్డి, నందికొండ శ్రీనివాస్ రెడ్డి, సెంట్ జాన్సన్ స్కూల్ ప్రిన్సిపాల్ రామ్ రెడ్డి, ఇందిర స్కూల్ ప్రిన్సిపాల్ అన్వర్, రమణ రెడ్డి, నర్సింగ్ రావు, స్వామి, రమేష్ గౌడ్, వీ రాజు, రాజు రెడ్డి, నూతల కంటి రాజు, మహేష్ యాదవ్, కృష్ణ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి , నెమలి కొండ సునీల్ రెడ్డి, మహమ్మద్ అజీమ్, శ్రీమంత్ గౌడ్, గొల్లం నరేష్, జి రాకేష్, జి క్రాంతి కుమార్, సిహెచ్ నరేష్, రాజశేఖర్, సాహిద్, షరీఫుద్దిన్, ప్రవీణ్ గౌడ్, మధు గౌడ్, నర్సింగ్ రావు, టోనీ ఫ్రాన్సిస్, రేవంత్, ఉమా, చందు తదితరులు పాల్గొన్నారు.



హైదర్‌గూడ శ్రీ నల్లపోచమ్మ దేవాలయంలో అమావాస్య పూజల్లో పాల్గొన్న భక్తులు

## హైదర్‌గూడ శ్రీ నల్లపోచమ్మ దేవాలయంలో అమావాస్య పూజలు



రాజేంద్రనగర్, డిసెంబర్ 19 (నమస్తే ఉదయం) వేదపండితుల మంత్రోచరణల మ్యధ్య శుక్రవారం హైదర్‌గూడలోని శ్రీ నల్లపోచమ్మ దేవాలయంలో అమావాస్య పూజలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కుంకుమార్చనలు, అభిసేకం చేసి అమ్మవారికి పూలు,న పండ్లు, నూతన వస్త్రాలను సమర్పించారు. అనంతరం దాత గోదెల చంద్రయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ పూజల్లో దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



## చర్లపల్లి డివిజన్‌ను ఉత్తమ డివిజన్‌గా తీర్చిదిద్దుతా

**బొంతు శ్రీదేవి యాదవ్**

మేడ్చల్ జిల్లా ప్రతినిధులు ( చర్లపల్లి డివిజన్ ):- చర్లపల్లి డివిజన్ ఉత్తమ డివిజన్ గా తీర్చి దిద్దుతానని స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ అన్నారు. శుక్రవారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో స్థానికులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్లో నెలకొన్న సమస్యలతో పాటు పలు అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తానని అన్నారు. ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా తన వంతు కృషి చేస్తానని చెప్పారు. డివిజన్ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు డివిజన్ నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మహాలక్ష్మి దేవాలయంలో ప్రత్యేక పూజలు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( అల్వాల్ సర్కిల్ ) డిసెంబర్ 19 ( నమస్తే ఉదయం ):-అల్వాల్ పరిధిలోని భారత్ నగర్ లో మహాలక్ష్మి అమ్మవారికి ఘ నంగా పూజలు జరిపారు. శుభ శుక్రవారం మహాలక్ష్మి దేవాలయం భారతి నగర్ లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ప్రతి శుక్రవారం ప్రత్యేక పూజలు ఉంటాయని ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటారని అలయ్య కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులతో పాటు సుధాకర్ రావు, రఘునాథ్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, అశోక్, రవికుమార్, విజయలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.




## నిజాయితీ పరులకు న్యాయమే వరిస్తోంది

**కందికంటి అశోక్ కుమార్ గౌడ్**

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( కుసాయిగూడ) డిసెంబర్ 19 (నమస్తే ఉదయం): నిజాయితీ పరులకు న్యాయం వరిస్తుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్చార్జ్ కందికంటి అశోక్ కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా న్యాయ స్థానం కుషాయిగూడ వద్ద పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ పై ఇ సి ఐ ఎల్ చౌరస్తా లో ధర్నా చేసినందుకు కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం పాఠకులకు విజితమే. అట్టి కేసు నిమిత్తం శుక్రవారం కోర్టుకు హాజరైనారు. హాజరు అయిన వారు మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా కన్వీనర్ ఉప్పల్ ఇంచార్జ్ కందికంటి అశోక్ కుమార్ గౌడ్, రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరు కొండ సతీష్ బాబు మాజీ కౌన్సిలర్, గడ్డమిధి రాములు యాదవ్, రాష్ట్ర బి సి సెల్ ప్రధాన కార్యదర్శి, దూడల సాంబమూర్తి గౌడ్, టి యన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, శివానంద్, కాంటెస్టేడ్ కార్పరేటర్ దూడల నిర్మలా గౌడ్, తెలుగు మహిళా నాయకురాలు సావిత్రి, ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు టిక్కా ప్రకాష్, సీనియర్ నేతలు గొట్టిపాటి వెంకటేశ్వరావు, నాగరాజు తదితరులున్నారు.

# డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : శాంతి శ్రీనివాసరెడ్డి



చిత్తారి కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి..

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( అల్వాల్ సర్కిల్ ) డిసెంబర్ 19 ( నమస్తే ఉదయం ):- అల్వాల్ డివిజన్ లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడతానని స్థానిక కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం అల్వాల్ డివిజన్ సంపత్ చిత్తారి కాలనీలో కాలనీవాసుల పిలుపుమేరకు కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. కాలనీలో మౌలిక వసతులపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కాలనీలో అంతర్గతంగా డ్రైనేజీ మంచినీటి సమస్య, అంతర్గత రోడ్లు, కరెంటు స్తంభాల వంటి సమస్యలు ఉన్నట్లు కాలనీ వాసులు కార్పొరేటర్ కు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో పరిష్కారానికి సంబంధిత అధికారులతో చర్చించి వాటికి పరిష్కార మార్గం చేపడుతానని అన్నారు. చిత్తారి కాలనీలో నెలకొన్న సమస్యలకు సత్వరమే చర్య తీసుకుంటానని ఆమె కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి సూపర్వైజర్ శేఖర్, కాలనీవాసులు ఊర్మిళ , సాయి, లత, అర్చన, లావణ్య జ్యోతి, అంబిక, మోహన్ రావు, స్థానిక నాయకులు శరన్ గిరి ,ప్రేమ కుమార్, యాదగిరి గౌడ్ ,అరుణ్, సాజిద్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన మిరాసిపల్లి
# గ్రామ ఉప సర్పంచ్ దేశ్ రాజ్ యాదవ్

కొత్తకోట, డిసెంబర్ 19(నమస్తే ఉదయం) మండలం లోని మిరాసిపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచుగా కే వైదేహి భాస్కర్ రెడ్డి, ఉప సర్పంచ్ గా రాజు యాదవ్ విజయం సాధించారు. గ్రామంలోని 5వ వార్డ్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచి, ఉప సర్పంచ్ గా ఎన్నికైన దేశ్ రాజు యాదవ్ శుక్రవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిని పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే జియంఆర్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... గ్రామ ప్రజలు ఎంతో నమ్మకంతో ఓటు వేసిన ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేసే గ్రామ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు.






# బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

గట్టు, డిసెంబర్ 19(నమస్తే ఉదయం) బాల్య వివాహల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని 1098 చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ శివలీల అన్నారు. శుక్రవారం గట్టు మండలంలోని బోయలగూడెం జిల్లా పరిషత్ పాఠశాలలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ 1098 చైల్డ్ హెల్ప్ లైన్ ఆధ్వర్యంలో బాల్య వివాహ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు, బాలల సంక్షేమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ శివలీల మాట్లాడుతూ బాలల సంక్షేమం కోసం చైల్డ్ హెల్ప్ లైన్ 1098 అను టోల్ ఫ్రీ నెంబర్ దేశ వ్యాప్తంగా పని చేస్తుందని, 24 గంటలు సేవలు అందించే ఉచిత హెల్ప్ లైన్ నెంబర్ అని అన్నారు. పిల్లలు స్వేఛ్చాయుత వాతావరణంలో పెరగాలని ఆకాంక్షించారు. బాలల లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2012 గురించి వివరిస్తూ ఈ చ ట్టం బాలలకు రక్షణ కల్పిస్తుందని పేర్కొన్నారు. బాల కార్మికులు గా ఎవరైనా పనిచేస్తున్న కూడా ఆ పిల్లలను రిస్క్యూ చేసి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరచడం జరుగుతుందన్నారు. బాల కార్మిక నిషేధ చట్ట ప్రకారం పనిలో ఉంచుకున్న యజమాని మరియు తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే బేటి బచావో బేటి పడావో పథకం గురించి మరియు మహిళల సాధికారత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ పద్మ, చిట్టెమ్మ, విమల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# భర్త చేతిలో భార్య దారుణ హత్య



గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 19(నమస్తే ఉదయం) భర్త చేతిలో భార్య దారుణ హత్యకు గురైన సంఘటన గురువారం రాత్రి ధరూర్ మండలం నెట్టెంపాడు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుర్వ గోవిందుకు అదే గ్రామానికి చెందిన కురువ జమ్ములమ్మ (28)తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు కలరు. గురువారం రాత్రి భార్యాభర్తలిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో చిన్నపాటి గొడవ జరిగింది. తల్లిదండ్రుల మధ్య గొడవ సద్దుమణిగించేందుకు పెద్ద కొడుకు మల్లికార్జున్ జోక్యం చేసుకున్నాడు. దీంతో ఆగ్రహం చెందిన తండ్రి గోవింద్ కర్ర తీసుకొని బాలుడి తలపై కొట్టడంతో తీవ్రగాయలు కాగ భార్య కేకలు వేయడంతో ఇంటి పక్కన ఉన్న వారు ఏమి జరిగిందో ఇంటి తలుపులు తీయగా తీవ్రగాయలతో బాధితురాలు పరుగులు తీసింది. దీంతో భర్త, భార్యను నడీరోడ్డులో దారుణంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న ధరూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. నిందితుడు గతంలో కూడా తల్లిదండ్రులపై దాడికి పాల్పడిన కేసులో జైళ్లు శిక్ష అనుభవించాడని, కొంతకాలం హైదరబాద్ ఎర్రగడ్డలోని మెంటల్ హాస్పిటల్ లో చికిత్స పొందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతదేహాన్ని గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి శనివారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ధరూర్ ఎస్ఐ శ్రీహరి తెలిపారు.




# వరదలు, పరిశ్రమల ప్రమాదాల నివారణపై వీడియో కాన్ఫరెన్స్

జనగామ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 19(నమస్తే ఉదయం): జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వరదలు, పరిశ్రమల ప్రమాదాల నివారణపై ఈనెల 22న నిర్వహించు మాక్ ఎక్సర్సైజ్ గురించి శుక్రవారం హైదరాబాద్9 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎన్ డిఎంఏ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ) డైరెక్టర్ సుధీర్ బాల్, తెలంగాణ ఫైర్ సర్వీస్ డైరెక్టర్ నారాయణరావు, సంబంధిత శాఖల అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ వరదలు, పరిశ్రమల, రహదారుల ప్రమాదాలే కాక వివిధ రకాలుగా జరిగే విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలు, ముందు జాగ్రత్తలపై సంబంధిత శాఖల యంత్రాంగానికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. వరదల సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడం, వరద నీటిలో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి రిలీఫ్ క్యాంపులలో అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందన్నారు. వివిధ ప్రమాదాల్లో గాయపడ్డ క్షతగాత్రులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వైద్య బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. విపత్తు సమయంలో నీటిపారుదల, విద్యుత్, రహదారుల, పోలీస్, వైద్య, పౌరసరఫరాల, తదితర శాఖల అధికారులు సమన్వయంతో పని చేసేందుకు ఏటా మాక్ ఎక్సర్సైజ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వీసీ కి ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, రెవిన్యూ అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, అగ్ని మాపాక, పంచాయతీ రాజు తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికి యేసుక్రీస్తు మార్గం అనుసరణీయం

డాక్టర్ జయప్రకాశ్ గోపు


గోపు జయప్రకాశ్ ను సన్మానిస్తున్న దృశ్యం.

జనగామ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 19 (నమస్తే ఉదయం) : లోక రక్షకుడు యేసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళి అనుసరిస్తే ప్రేమ, శాంతి ప్రపంచం నెలకొల్పబ డుతుందని సోసైటీ ఆఫ్ క్రైస్ట్ జనరల్ సెక్రటరీ రెవరెండ్ డాక్టర్ జయప్రకాశ్ గోపు అన్నారు. శుక్రవారం జనగామ గెత్సేమనే ప్రార్థన మందిరం 15వ వార్షికోత్సవం స్థానిక సంఘ కాపరి బ్రదర్ హనోకు అధ్యక్షతన జరిగింది. ఈఈ సందర్బంగా జయప్రకాశ్ మాట్లాడుతూ యేసుక్రీస్తు చేసిన బోధలో ప్రధానమైనది ప్రేమ అని, నిన్ను వలె నీ పోరుగు వారిని ప్రేమించుమని బోధించార న్నారు. నేటి యాంత్రిక యుగంలో మానవ సంబందా లు కనమరుగౌతున్నాయని అన్నారు. ప్రపంచ మానవాళి రక్షణకై సిలువలో ప్రాణ త్యాగం చేసిన యేసుక్రీస్తు గొప్పతనాన్ని మార్గదర్శకంగా తీసుకుని ముందుకు సాగాలని జయప్రకాశ్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు జి.కృష్ణ, ఇనుముల నర్సయ్య, కాగితాల రవి, కొమ్మురాజుల గణేష్, మెకానికల్ రవి, మేకల నరేష్, విజయ కుమార్, బాలాజీ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 19(నమస్తే ఉదయం)పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం కోసం ఈ నెల 21న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను గద్వాల జిల్లా ప్రజలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గద్వాల కోర్టు మొదటి అదనపు జిల్లా సెషన్ కోర్టు న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్. రవికుమార్ అన్నారు. శుక్రవారం గద్వాల న్యాయస్థానంలోనీ తమ ఛాంబర్ లో అడిషనల్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి టి. లక్ష్మితో కలిసి జాతీయ లోక్ అదాలత్ పై ఆయన విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి అదనపు జిల్లా సెషన్ కోర్టు న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు సత్వర న్యాయం పొందవచ్చని తెలిపారు. ఈ సేవలు ప్రజలకు పూర్తిగా ఉచితంగా అందించబడతాయన్నారు. గద్వాల్ లోని న్యాయస్థాన ప్రాంగణంలో ఈనెల 21న ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాజీ పద్ధతిలో కాంపౌండ్బుల్ క్రిమినల్ కేసులు,అన్ని రకాల సివిల్ కేసులు జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకుని తమ సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలని సూచించారు.రాజీ కుదిరితే కోర్టు ఫీజులు తిరిగి చెల్లించబడతాయని పేర్కొన్నారు. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, కుటుంబపరమైన కేసులు, వైవాహిక జీవితం సంబంధిత కేసులు, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్ కేసులు,రోడ్డు ప్రమాదాలు, ఇతర కేసులపై సంబంధించిన ఇరుపక్షాల సమ్మతితో రాజీతో పరిష్కారమయ్యే కేసులన్నింటినీ పరిష్కరించడం జరుగుతుందని వివరించారు. వివిధ కారణాలతో గాయపడి లోక్ అదాలత్ కు రాలేని కక్షిదారులు కూడా ఆన్లైన్లో కనిపించి మాట్లాడినా రాజీ కుదురుచడం జరుగుతుందన్నారు. జాతీయ న్యాయ సేవా సంస్థ ప్రతిష్టాత్మకంగా ఈ లోక్ అదాలత్ ను నిర్వహిస్తూ దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో పేరుకు పోయిన పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడానికి విశేష కృషి చేస్తుందన్నారు. రాజీ మార్గం రాజమార్గమని చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని సూచించారు. జిల్లా ప్రజలంతా తమ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకొని శాంతియుతంగా, సంతోషంగా జీవించాలని వారు కోరారు.

# సైబర్ నేరాలపై అవగాహన



గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్19(నమస్తే ఉదయం)కొత్త పద్ధతుల్లో పుట్టుకొస్తున్న సైబర్ నేరాలను అడ్డుకోవడంపై ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్ రెండవ ఎస్ఐ సతీష్ కుమార్ రెడ్డి సూచించారు. సైబర్ జాగృత దివస్'ను పురస్కరించుకొని శుక్రవారం గద్వాల రైల్వే స్టేషన్ లో ప్రయాణికులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ మోసగాళ్లు అనుసరిస్తున్న నూతన పద్ధతుల గురించి విద్యార్థులకు, ప్రజలకు వివరించారు. ముఖ్యంగా, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లో ఆకర్షణీయమైన ఆఫర్‌లు సృష్టించి.. యూపీఐ, ఈ-వాలెట్‌ల ద్వారా మోసం చేస్తున్నారని తెలిపారు. పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో గృహిణులు, నిరుద్యోగుల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. నకలీ నంబర్ ప్లేట్, ఫాస్టాగ్, హెచ్ఎస్ఆర్పీల పేరిట మోసాలకు పాల్పడుతున్నారని.. ఈ తరహా మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. సైబర్ నేరాల బారినపడిన వారు వాట్సాప్ నంబర్ 8712672222కు రిపోర్ట్ చేయాలని ఆయన సూచించారు.



# శాశ్వత అన్నదాన పథకానికి విరాళం

కెటిదొడి, డిసెంబర్ 19(నమస్తే ఉదయం) కేటిదొడ్డి మండలం వెంకటాపురం గ్రామంలో వెలసిన పాగుంటా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి శుక్రవారం రాయచూరు జిల్లా పురుతిప్పల గ్రామానికి చెందిన సూర్యకాంత్‌రెడ్డి దంపతులు రూ.51,000 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు దాతలను శేష వస్త్రంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అప్పరాల సర్పంచ్ మాసన్నకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపిన నాయకులు



కొత్తకోట, డిసెంబర్ 19(నమస్తే ఉదయం) మండలంలోని అప్పరాల సర్పంచ్ మాసన్న కు పితృ వియోగం కలిగింది. విషయం తెలుసుకున్న మండల నాయకులు సర్పంచ్ మాసన్న తండ్రి నరసన్న పార్థివ దేహానికి నివాళు లర్పించారు. మాసన్న ను పరామర్శించిన మాజీ సి డి సి చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి, చర్లపల్లి సర్పంచ్ సూదిని శేఖర్ రెడ్డి, మాజీ మార్కెట్ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి, రామకృష్ణాపురం గ్రామానికి చెందిన ఎం లోకా రెడ్డి, ఎంకటేశ్వర్ రెడ్డి, డి రాజ వర్ధన్ రెడ్డి ,తదితరులు ఉన్నారు.

# ఆలయాల్లో అమావాస్య పూజలు

కేటిదొడ్డి, డిసెంబర్19(నమస్తే ఉదయం)అమావాస్య సందర్భంగా కేటిదొడ్డి మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వెలసిన పాగుంటా శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అఖండ భజనలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## కన్నుల పండువగా స్వామీ వారి కళ్యాణోత్సవం

అమావాస్య సందర్భంగా పాగుంటా శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా కొనసాగింది.తెల్లవారుజామున ఆలయ అర్చకులు



ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఉదయం ప్రాతఃకాల పూజలు, అభి షేకం, దీక్షా హోమం, శాంతి హోమం, పూర్ణాహుతి, చక్ర స్నానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంత రం అలివేల మంగ



సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రథోత్సవ కార్యక్రమాని నిర్వహించారు.

# నేడు హిమాయత్ సాగర్, మైలార్దేవపల్లి, షాపూర్‌లలో

# విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజేంద్రనగర్/బండ్లగూడ/శంషాబాద్, డిసెంబర్ 19(నమస్తే ఉదయం) హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్రా నిమిత్తం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ రమేష్ తెలిపారు. సెక్షన్ పరిధిలోని హైదర్ షాకోట్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుండి 11:30 వరకు వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రస్తావనగర్, తిరుమల గార్డెన్, రాధా రియాప్స్ ఫేస్ టు, పావని హార్మోని విల్లా, సాయి శక్తి అపార్ట్మెంట్స్, 11:30 నుండి 12:30 వరకు కాళీ మందిర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన ఇండస్ వ్యాలీ, సంజయ్ గాంధీనగర్, భవాని కాలనీ, బైరాగి గూడ, శివ సాయి నగర్, సుబ్రహ్మణ్య కాలనీ, రంగారెడ్డి కాలనీ, వాల్మీకి ఆశ్రమం, శివ పూరి, గంధం గూడ, 11:30 నుండి 1:00 వరకు పి అండ్ టి కాలనీ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన పి అండ్ టి కాలనీ ఏబిసిడి స్పెషల్ బ్లాక్స్, హైదర్ ఎంక్లేవ్, కీర్తి రిచ్మండ్ విల్లాస్, మధ్యాహ్నం 12 గంటల నుండి 1:00 వరకు భాగ్యనగర్ ఫీడర్ పరిధిలోని నర్సారెడ్డి కాలనీ, రాధా నగర్ ఫేస్ ట, కేకే కన్వెన్షన్, మధ్యాహ్నం మూడున్నర నుండి సాయంత్రం నాలుగున్నర వరకు మాధవి నగర్ ఫీడర్



పరిధిలో గల ప్రాంతాలైన మాధవి నగర్, కపిల్ నగర్, ఫోర్ట్ వ్యూ అపార్ట్మెంట్ ప్రాంతాలలో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

**షాపూర్ లో...**

షాపూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరల నిమిత్తం శనివారం నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు షాపూర్ ఇండస్ట్రియల్ పీటర్ పరిధిలో ఘన్సీమియా గూడ, గండిగూడ, గ్రాండ్ విల్లా, ఆటోనగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ ఎంత రాయని గ్రహించి పనులు చేస్తున్న సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

**మైలార్దేవ్పల్లిలో...**

మైలార్దేవ్పల్లి సెక్షన్ పరిధిలో శనివారం వివిధ మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. సెక్షన్ పరిధిలో అబ్దుల్లా కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుండి మూడు గంటల వరకు మొగల్ కాలేజ్, అబ్దుల్లాహ కాలనీ, పటేల్ నగర్, హరిజన్ బస్తి, రెహమత్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్రిస్టల్ టౌన్, రెహమత్ కాలనీ, జహంగీరాబాద్, మైలార్దేవ్పల్లి విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో గల ప్రాంతాలైన మొగల్ కాలనీ, ప్రగతి కాలనీ, బృందావన్ కాలనీ, రామ కృష్ణ హిల్స్ ప్రాంతాలలో మధ్యాహ్నము రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

# సివిల్ సర్వీసెస్ ధ్యేయంగా ఉద్యాన విద్యార్థులు ఎదగాలి

### రాజేంద్రనగర్ శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, డిసెంబర్ 19 (నమస్తే ఉదయం) ఉద్యాన విద్యార్థులు సివిల్ సర్వీసెస్ సాధించడమే ధ్యేయంగా పోటీ పరీక్షలలో రాణించాలని, తద్వారా దేశానికి అత్యున్నత సేవ చేసే భాగ్యం కలుగుతుందని రాజేంద్రనగర్ శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం మొదటి బోధన, బోధనేతర సిబ్బంది రాష్ట్రస్థాయి ఆటల, పోటీలు, సాంస్కృతిక, వైజ్ఞానిక పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యాన కళాశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు, లైబ్రరీ కావలసిన ఇతర అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో నివేదిస్తామని, అవసరమైన నిధులు మంజూరు అయ్యేలా ప్రయత్నిస్తానని శాసనసభ్యులు టి. ప్రకాష్ గౌడ్ చెప్పారు. దైనందిన ఉద్యోగ విధులలో బాగా రాణించేందుకు ఆటల, పోటీలు దోహదం చేస్తాయని అన్నారు. ఒత్తిడిని జయించే మార్గాలు సైతం ఉద్యోగ వృత్తిలో భాగమేనని ముగింపు కార్యక్రమానికి అధ్యక్షత శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ డాక్టర్ దండ రాజిరెడ్డి తెలిపారు. జన విశ్వవిద్యాలయం పూర్తిస్థాయి తెలంగాణ రైతు సేవలో



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్




క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చాటిన ఉద్యోగులకు మెమొంటోల్లు అందజేస్తున్న ఉపకులపతి డాక్టర్ రాజిరెడ్డి

నిమగ్నమై ఉందని, విద్య, విస్తరణ, పరిశోధన ద్వారా రాష్ట్ర రైతులు, ప్రజలకు అత్యంత చేరువవుతుందని వర్సిటీ వైస్ ఛాన్సర్ రాజిరెడ్డి అన్నారు. ప్రొఫెషనల్ ప్లేయర్స్ కి ఏమాత్రం తగ్గకుండా వర్సిటీ సిబ్బంది అన్ని అంశాల్లో పోటీ పడ్డారని డీన్ అఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జే. చీనా అన్నారు. అనంతరం క్రికెట్, వాలీబాల్, బ్యాట్మెంటన్, ఇతర వ్యక్తిగత పోటీలలో విన్నర్స్, రన్నర్స్ బోధన, బోధనేతర సిబ్బందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎన్.శ్రీనివాసన్, యూనివర్సిటీ లైబ్రేరియన్ డాక్టర్ ఎం.రాజశేఖర్, రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రశాంత్, ప్రొఫెసర్ పెడిగం సైదయ్య, డాక్టర్ వీణ జోషి, ప్రీతం గౌడ్, పోతరాజు యాదయ్య, చెంచురామయ్య, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆసియా ఖండంలోనే అతిపెద్ద కాలనీగా పేరుపొందిన కాలనీ కెపిహెచ్బి

### కెపిహెచ్బి కాలనీని మూడుముక్కలుగా విభజన చేయవద్దు

### గాంధీ విగ్రహం దగ్గర నిరసన వ్యక్తం చేసిన కెపిహెచ్బి కాలనీ వాసులు

కూకట్ పల్లి, డిసెంబర్ 19 (నమస్తే ఉదయం) జిహెచ్ఎంసి డివిజన్ల తాజా పునర్విభజనలో భాగంగా ఆసియా ఖండంలోనే అతిపెద్ద కాలనీగా పేరొందిన కేపిహెచ్బి కాలనీని విభజించి మూడు ముక్కలు చేయవద్దు అని కెపిహెచ్బి కాలనీ మొదటి రోడ్డు గాంధీ విగ్రహం దగ్గర కెపిహెచ్బి కాలనీ వాసులు శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టారు. కెపిహెచ్బి కాలనీ రోడ్డు నెంబర్ ఒకటి నుంచి కల్వరి




టెంపుల్ వరకు కెపిహెచ్బి కాలనీ డివిజన్ అని, బాలాజీ నగర్ డివిజన్ అని, వసంత నగర్ డివిజన్ అని మూడు ముక్కలుగా చేశారని, 46 సంవత్సరముల క్రితం ఆవిర్భవించిన కేపీహెచ్బీ కాలనీ అస్తిత్వం కోల్పోతుందని అలా కాకుండా కెపిహెచ్బి కాలనీ రోడ్ నెంబర్ 1 నుంచి జేఎన్టీయూ రోడ్డు వరకు కెపిహెచ్బి కాలనీ డివిజన్ -1 గా, జేఎన్టీయూ రోడ్డు నుంచి కల్వరి టెంపుల్ ముందు రోడ్డు వరకు కెపిహెచ్బి కాలనీ డివిజన్- 2 గా చేయాలని కాలనీవాసులందరూ ముక్తకంఠంతో కోరుచున్నారు. ఈ కార్యక్రమంలో కట్టా నరసింగరావు, కొల్లా శంకర్, షేక్ సత్తార్, జె.ఎస్ నారాయణరావు, రాచకొండ భాస్కర్, ముప్పాళ్ళ సాంబశివరావు, గాలి బాలాజీ, శరత్ బాబు, షేక్ మహబూబ్, అకనంబట్టు కుమార్ రెడ్డి, ఎలమంచిలి వెంకట సుబ్రహ్మణ్యేశ్వర రావు, అట్లూరి దీపక్ చౌదరి, ప్రసాద్, అంజి, గోవర్ధనాచారి, ఆర్కే చౌదరి, పట్లోళ్ల సాయినాథరెడ్డి, తులసి రెడ్డి, ఆర్ వి సత్యనారాయణ, మదన్, వెంకట్ రెడ్డి, నాగిరెడ్డి, నంద్యాల రవి, నరసింహులు, శ్రీనివాస్, తమ్మినేని ప్రవీణ్ కుమార్, గంధం కరుణాకర్ నాయుడు, కోక్కిలగడ్డ ఫణికుమార్, దొడ్డి రంగస్వామి తదితరులు పాల్గొన్నారు. కూకట్పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే కంటెస్టెంట్ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ఈ కార్యక్రమానికి హాజరై సంఘీభావాన్ని తెలియజేశారు.

# చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

### రాజేంద్రనగర్ జోన్ డీసీపీ యోగేష్ గౌతమ్

### రౌడీ షీటర్ల తీరు మారకుంటే పీడీ యాక్ట్ అమలు డిసిపి హెచ్చరిక

రాజేంద్రనగర్,డిసెంబర్19(నమస్తే ఉదయం) రౌడీ షీటర్ల తీరు మారకుంటే పీడీ యాక్ట్ అమలు చేస్తామని,చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రాజేంద్రనగర్ జోన్ డీసీపీ యోగేష్ గౌతమ్ హెచ్చరించారు.శుక్రవారం రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో అత్తాపూర్, నార్సింగి పోలీస్ స్టేషన్ల పరిధిల్లోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు.రౌడీ-షీటర్ల (నేరస్థుల) కదలికలను పోలీసులు ఎప్పుడూ పర్యవేక్షిస్తుంటారని,ఈ విషయాన్ని రౌడీషీటర్ లందరూ గుర్తుంచుకోవాలని సూచించారు.రౌడీ షీటర్లు బెయిల్ షరతులను ఖచ్చితంగా పాటించాలని,నిబంధనలు తుంగలో తొక్కి తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తామంటే ఏ మాత్రం కుదరదన్నారు.రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చేందుకు ఈ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు




చెప్పారు.రౌడీషీటర్ల నేర చరిత్ర,వారిపై ఉన్న కేసుల వివరాలు,ప్రస్తుత జీవన విధానం,ఉద్యోగ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.ఇప్పటి నుండి రౌడీషీటర్స్ ఉన్న వారు ఎలాంటి కేసులోనైనగా తల దూర్చరాదని సూచించారు.ఈ కౌన్సిలింగ్ హాజరైన వారిలో ఎవరైనా భవిష్యత్తులో నేరాలలో పాలుపంచుకుంటే చట్టంలో ఉన్న యాక్ట్ ల ప్రకారం శాశ్వతంగా జైలు జీవితం గడపాల్సి వస్తుందని డీసీపీ యోగేష్ గౌతమ్ హెచ్చరించారు.రౌడీ షీటర్లు నేరప్రవృత్తిని వదిలి ఎదో ఒక ఉపాధి రంగాల్లో స్థిరపడాలని రాజేంద్రనగర్ జోన్ డీసీపీ యోగేష్ గౌతమ్ సూచించారు.తమ దృష్టిని నేరాల వైపు మళ్ళిస్తే ఎంతో అమూల్యమైన జీవితాలను నాశనం అవుతాయన్నారు. ప్రధానంగా అర్ధరాత్రి సమయంలో బహిరంగ ప్రదేశాల్లో తిరగకుండా ఉండాలని వెల్లడించారు.రౌడీ షీటర్లు నిబంధనలను ఉల్లంఘిస్తే వెంటనే బెయిల్ రద్దు చేయబడుతుందని స్పష్టం చేశారు.దీని ఫలితంగా జ్యుడీషియల్ కస్టడీకి, ( కటకటాల్లోకి )పంపడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా నేరస్తులు తమ నేల ప్రవృత్తిని వదిలేసి తమ కుటుంబాల సంక్షేమం కోసం వివిధ ఉపాధి రంగాల్లో స్థిరపడాలని సూచించారు.పాత నేరస్తులు ఎవరైనా సరే మళ్ళీ మళ్ళీ తప్పు చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు.ఈ సమావేశంలో అత్తాపూర్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు,ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# జలమండలిలో క్రిస్మస్ వేడుకలు

ఖైరతాబాద్, డిసెంబర్ 19(నమస్తే ఉదయం) జలమండలిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ వేడుకలకు డైరెక్టర్లు ముహమ్మద్ అబ్దుల్ ఖాదర్, శ్రీధర్, పద్మావతి, వినోద్ భార్గవ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు జలమండలి వినియోగదారులు, ఉద్యోగులు, సిబ్బందికి ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. యేసుక్రీస్తు మానవత్వానికి మరోరూపం అని క్రిస్మస్ సందేశం అందించిన పాస్టర్ తెలిపారు. యేసు క్రీస్తును శాంతి ప్రదాతగా పేర్కొన్నారు. యేసు చేసిన బోధనల్లోని మంచిని ఇతరులకు చెప్పాలని అన్నారు. జీఎం డేవిడ్ రాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో జీఎంలు ఏజే సుగంధిని, మాణిక్యం, వసంత, సునీల్, డీజీఎంలు నిరుపమ, దీపాలి, రమేష్, నరహరి, అరుణ్, చిట్టి బాబు, పాస్టర్ రెవరెండ్ జెఫన్య, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.



# శబరికి పాదయాత్ర పూర్తి చేసుకుని తిరిగి వచ్చిన స్వాములను సన్మానించిన ఆర్యవైశ్య సంఘం నాయకులు

రాజేంద్రనగర్, డిసెంబర్ 19 (నమస్తే ఉదయం) సువర్ణ భూమి శ్రీ శబరిమల మహాపాదయాత్ర లో భాగంగా శ్రీ వాసవి అమ్మవారి భక్తుడు శ్రీ ఓరుగంటి మల్లేష్ గుప్తా ( బాబుల్ రెడ్డినగర్. కాటేదాన్) వాస్తవ్యులు 6. వ సారి కాటేదాన్ అయ్యప్ప స్వామి దేవాలయం నుండి పాదయాత్రగా బయలుదేరి శబరిమల చేరుకొని శ్రీ అయ్యప్ప స్వామి దర్శనం విజయవంతం చేసుకొని వచ్చిన సందర్భంగా బాబుల్ రెడ్డి నగర్ ఫ్రెండ్స్ యూత్ అసోయేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి దేవాలయం లో ఈ కార్యక్రమం లో మాజీ వార్డ్ కమిటీ సభ్యులు సోమ శ్రీనివాస్, పల్లపు జగన్ సురేష్ , రమేష్ , లింగం , అరుణ్ ,రవి, వాసవి దేవాలయం ఫౌండర్ వర్కింగ్ ప్రెసిడెంట్ అర్థం శ్రీనివాస్ గుప్తా, ఆర్యవైశ్య యువజన సంఘం ప్రెసిడెంట్ గుడిపల్లి శేఖర్ గుప్తా, ఫౌండేర్ సభ్యులు సోమ అశోక్ గుప్తా, పూరి శ్రీనివాస్ గుప్తా, గంగూలీ నరసింహా గుప్తా , ఆర్యవైశ్య మండల సంఘం ప్రసిడెంట్ వనమాల సురేష్ గుప్తా, వల్లకొండ విజయకుమార్ గుప్తా ,చిగుళ్ల పల్లి సత్యనారాయణ గుప్తా, పాండు గుప్తా , ప్రకాష్ గుప్తా ప్రశాంత్ పంతులు తది తరులు పాల్గొన్నారు.




# చదువుతూనే క్రీడల్లోనూ రాణించాలి: ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు, డిసెంబర్ 19 (నమస్తే ఉదయం): కేవలం విద్య మాత్రమే అభ్యసిస్తే సరిపోదు ఆటపాటల్లోనూ విద్యార్థులు చురుకుగా ఉండాలని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సూచించారు. సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం పటాన్చెరు డివిజన్ పరిధిలో గల భాష్యం బ్లూమ్స్ పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమానికి గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థులకు మంచి విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు. వారి ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరాంఘర్ చౌరస్తా సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి

బుద్వేల్, డిసెంబరు 19 (నమస్తే ఉదయం) : శివరాంపల్లి నుంచి ఆరాంఘర్ చౌరస్తా వైపు వెళ్లే మార్గంలో పిల్లర్ నెంబర్ 316 వద్ద మహేంద్ర షోరూమ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృ తి చెంది పడి ఉన్నాడు. అతని వివరాలు తెలియరాలేదు. స్థానికుల సమాచారం మేరకు అతా పూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మరణించిన వ్యక్తి మృతదేహాన్ని పోస్టు మార్టం ఉస్మానియా మార్చురీకి తరలించారు. శివరాంపల్లి నుంచి ఆరాంఘర్ కు వెళ్లే మార్గంలో ఉన్న మద్యం దుకాణంలో అతిగా మద్యం సేవించడం వల్ల ఆ వ్యక్తి మరణించాడా ? గుండెపోటు కు గురై మరణించాడా తెలియాల్సి ఉంది. పోస్టుమార్షం నివేదిక ఆధారంగా అసలు విషయాలు తెలిసే అవకాశం ఉంది. కేసు నమోదు చేసుకున్న అత్తాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733